నిరుపయోగంగా భవనాలు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- రూ.లక్షల ప్రజాధనం వృథా



బిచ్కుందలో ఆగిన పల్లె దవాఖానా పనులు



నిలిచిపోయిన ఎక్సైజ్ భవనం పనులు

బిచ్కుంద(జుక్కల్): ప్రజా అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. కాంట్రాక్టర్లు సగం పనులు చేసి వదిలేసి వెళ్లిపోయారు. పనులు ఏళ్ల నుంచి నత్తనడకన కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో 8 ఏళ్ల క్రితం ఐటీఐ కళాశాల పక్కన రూ.20 లక్షల వ్యయంతో రెండు అంతస్తుల ఎక్సైజ్ కార్యాలయం కోసం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారుల అలసత్వంతో నేటి వరకు పనులు పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ స్లాబ్ వేసి సగం పనులు చేసి చేతులెత్తేసి పనులు చేయనని వెళ్లిపోయారు. 8 ఏళ్ల నుంచి భవనం అసంపూర్తిగా ఉంది. పనులు ఎందుకు ఆగిపోయాయి.. నేటి వరకు సంబంధిత శాఖ, పర్యవేక్షిస్తున్న అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఎక్సైజ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్ల ఆదాయం వస్తోంది. పక్కా భవనం లేక కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగుతుంది. విద్యా వ్యవస్థ బలోపేతం చేయడానికి గత ప్రభుత్వం మన ఊరు మన బడి పథకం కింద బిచ్కుందలో బాలుర గణేష్ మందిరం ప్రాథమిక పాఠశాలలో గదులు నిర్మించడానికి రూ.లక్షల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయకుండా అర్ధాంతరంగా పనులు ఆపేశారు. పాఠశాలలో తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరం నుంచి పనులు ఆగిపోయాయి. నిధులు లేక పనులు చేయడం లేదని కాంట్రాక్టర్ అంటున్నారు. దీంతో పాటు మెట్టుతండా, బిచ్కుందలో అంగన్‌వాడి భవనం నిర్మించి పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. నాసిరకం పనులు చేయడంతో బిచ్కుంద అంగన్‌వాడి భవనంలో వర్షపు నీరు ఊరుతున్నాయి.. నాణ్యత లోపించింది. రెండేళ్ల నుంచి భవనాన్ని అధికారులు ఆధీనంలోకి తీసుకోవడం లేదు. కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని పనులు చేయనని వదిలేశారు. బిచ్కుంద, మిషన్ కల్లాలిలలో పల్లె దవాఖానాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అధికారులు స్పందించి భవనాలు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోతున్న ధాన్యరాశులు

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల మొర



భవానిపేట కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యరాశులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. లింగంపేట మండలంలోని భవానిపేట, జల్దిపల్లి, ముంబోజిపేట, కంచుమల్, కొండాపూర్, లింగంపేట తదితర గ్రామాల శివారులో బోరుబావుల వద్ద ముందుగా వేసిన వరి పంటలు నూర్పిళ్లు చేసి 15 రోజులు గడుస్తున్నాయి. నూర్పిళ్లు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి 15 రోజులు గడుస్తోంది. సొసైటీ అధికారులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు. నేటికి మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే ధాన్యం మొలకెత్తి నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు వందల సంఖ్యలో రైతులు వరి నూర్పిళ్లు చేసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోతున్నాయి. నూర్పిళ్లు చేసిన ధాన్యాన్ని కొంత మంది రైతులు రోడ్లపై ఆరబెడుతున్నారు. దాంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఫ్లెక్సీని చించేశారని యువకుల ఆందోళన



భిక్కనూరు: మండల కేంద్రంలో ఫ్లెక్సీని చించివేయడంతో యువకులు స్థానిక చౌరస్తా వద్ద పాత జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వివరాలు.. ఆర్టీఏ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ యువత మేలుకో అవినీతి అక్రమాలను ఎదిరించు అంటూ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఈ విషయం తెలుసుకున్న యువకులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ప్రజలను చైతన్య పరిచే ఫ్లెక్సీలను తొలగించడం సిగ్గుచేటని, తొలగించినవారు తమ పద్ధతిని మార్చుకోకుంటే వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించి అనంతరం యువకులు తమ నిరసనను విరమించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



రాజంపేట: రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రాజంపేట సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్ అన్నారు. రాజంపేట సహకార సంఘం పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్, డైరెక్టర్లు భాగయ్య, సాయిబాబా, బాలయ్య, సుధాకర్‌రెడ్డి, నర్సవ్వ, ఏవో సునీతా రాణి, ఏఈవో శిల్ప, సీఈవో వేంకటేశ్వర శర్మ, మానిటరింగ్ అధికారి మసీయోద్దీన్, రైతులు పాల్గొన్నారు.

వరికోతలు షురూ..



బాన్సువాడ రూరల్: దసరా పండుగ అయిపోవడంతో మండలంలో రైతులు వరికోతలు ప్రారంభించారు. ప్రతి గ్రామానికి శివారును బట్టి పదుల సంఖ్యలో వరికోత యంత్రాలు చేరుకున్నాయి. ముందస్తుగా సాగు చేసిన రైతుల పంటలు చేతికి రావడంతో నూర్పిళ్లు ఊపందుకున్నాయి. బోర్లం, ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్, దేశాయిపేట్, సోమేశ్వర్ గ్రామ శివార్లలో వరికోతలు జోరుగా సాగుతున్నాయి. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని రోడ్లపై పోసి ఆరబెడుతుండటంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్తున్నారు.

ప్రభుత్వ మాజీ విప్ పరామర్శ



భిక్కనూరు: బస్వాపూర్‌లో స్నేహితుడి కుటుంబాన్ని ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బాదే లింగం మూడు రోజుల క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న గంప గోవర్ధన్ గ్రామానికి వచ్చి పరామర్శించారు. గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. తన స్నేహితుడు లింగం మృతి తీరని లోటని ఆ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు బుర్రి గోపాల్, కర్నాల మల్లేషం, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



దోమకొండ: మండల కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యులు లింబాద్రి ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులను అందజేశారు. మొత్తం 28 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కొందరిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు ఆయన వివరించారు. వైద్య సిబ్బంది మల్లికార్జున్ తదితరులున్నారు.

కలెక్టరేట్‌లో అలయ్ బలయ్



కామారెడ్డి క్రైం: విజయ దశమి పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవడం సంతోషకరమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఉద్యోగులు, జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. దసరా నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు జమ్మి ఆకులను కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీజీవో అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లా, వాటర్ ప్యూరిఫయర్ ధ్వంసం





భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని దుండగులు సోమవారం వేకువజామున చొరబడ్డారు. పాఠశాల గది తలుపు చెక్కను తొలగించి లోనికి ప్రవేశించిన దుండగులు మెస్‌లోని నల్లాలను, వాటర్ ప్యూరిఫయర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'రైతులకు సేవ చేసే భాగ్యం కలిగింది'



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కిష్టాగౌడ్

భిక్కనూరు: బస్వాపూర్ సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జీగా రైతులకు మరిన్ని సేవలు చేసే భాగ్యం కలిగిందని విండో పర్సన్ ఇన్‌చార్జీగా నియమితులైన నాగన్నగారి మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. రుణమాఫీ పథకం వర్తించని రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదికను అందజేస్తానన్నారు. తనకు పదవి రావడానికి కృషిచేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి రుణపడి ఉంటానన్నారు. పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, సీఈవో మహేశ్వరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. అలాగే కాచాపూర్ సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జీగా లింగాల కిష్టాగౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాజీ ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి, నాయకులు రాజగౌడ్, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను అరికట్టండి



భిక్కనూరు: మండల కేంద్రంలో కుక్కల బెడద నుంచి కాపాడాలని భిక్కనూరు ఎంపీడీవో రాజకిరణ్‌రెడ్డికి బీజేపీ నేతలు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో ప్రతిరోజు కుక్కల వల్ల పలువురికి గాయాలవుతున్నాయని, వెంటనే కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆ వినతి పత్రంలో కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, నేతలు అరిగే నర్సింలు, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విలాస్‌రెడ్డి, ప్రభాకర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయండి



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని వ్యాపారులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై వేసిన డస్ట్ పౌడర్ వల్ల దుమ్ము బాగా రావడంతో వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ మార్గంలో దుమ్ము రాకుండా ఉండేందుకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పోయాలని వ్యాపారస్తులు కోరారు.

గౌతమ బుద్ధుడి సందేశాన్ని పాటించాలి



మద్నూర్‌లో బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



మద్నూర్ మార్కెట్ కమిటీలో సోయా పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): గౌతమ బుద్ధుడు ప్రజలకు సూచించిన సందేశాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం గౌతమ బుద్ధుడి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రూ.13 లక్షల సీడీసీ నిధులతో ఎస్సీ కాలనీలో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని మండల కేంద్రంలో ఊరేగింపుగా తీసుకొచ్చి అనంతరం ఆవిష్కరించారు. స్థానిక శక్కర్గా చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతం గురించి ఆలోచించకుండా భవిష్యత్తు గురించి కలలు కనకుండా ప్రస్తుత క్షణాలపై కేంద్రీకరించాలని గౌతమ బుద్ధుడు చెప్పిన సూక్తులను అందరూ పాటించాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిలు, నేతలు హన్మండ్లు స్వామి, రాంపటేల్, ప్రజ్ఞకుమార్ ఉన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

మద్నూర్(జుక్కల్): స్థానిక మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన సోయాబీన్ పంటను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పరిశీలించారు. సోమవారం మార్కెట్ కమిటీని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే సోయా పంటను విక్రయించాలని సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ వేద్ పటేల్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు.

కనులపండువగా దుర్గామాత శోభాయాత్ర



కిచ్చన్నపేటలో దుర్గామాత శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువతీయువకులు



తాండూర్‌లో దుర్గామాత శోభాయాత్ర సందర్భంగా నృత్యం చేస్తున్న యువకులు

నాగిరెడ్డిపేట, రామారెడ్డి, ఎల్లారెడ్డి మండలాల పరిధిలో సోమవారం దుర్గామాత శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా అమ్మవారి శోభాయాత్రను కొనసాగించారు. యువతీయువకులతో పాటు మహిళలు ఉత్సాహంగా శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



రామారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో దుర్గామాత శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

లెక్చరర్ల నియామకం



బీబీపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇద్దరు లెక్చరర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం లెక్చరర్లు బాధ్యతలు స్వీకరించారు. కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించడానికి రంగారావు, ఇంగ్లీష్ సబ్జెక్టుకు శ్రీకాంత్‌రావు వచ్చారు. పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను కలిసి వివరాలు అందించారు.

సంఘమేశ్వర్ గ్రామ పద్మశాలి సంఘం కార్యవర్గం ఏర్పాటు

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్యాదరి రవీందర్, ఉపాధ్యక్షుడిగా క్యాదరి శ్రీనివాస్, క్యాదరి నాగభూషణం, వంగరి ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా క్యాదరి నవీన్, కోశాధికారిగా సాప రాంచంద్రం, సహాయ కార్యదర్శులుగా నర్సింలు, రామకృష్ణ, స్వామి, ప్రచార కార్యదర్శిగా కాముని సునీల్, సలహాదారులుగా సాప రాజలింగం, క్యాదరి దుబ్బ రాజం, కాముని నరహరి, కుమారస్వామిలను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ కరపత్రాల విడుదల



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ తహసీల్ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కరపత్రాలను స్థానిక తహసీల్దార్ హిమబిందు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, గిర్దావర్ రామ్ పటేల్ తదితరులున్నారు

ఇందిరమ్మ కమిటీలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ కమిటీలను ఎన్నుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తాడ్వాయి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో పర్యటించి కమిటీల సభ్యులను నియమించారు. కాంగ్రెస్ పార్టీ వల్లనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, లక్ష్మణచారి, సుధాకర్‌రావు, అఖిల్‌రావు, రాజు, రాజయ్య, సంజీవులు, సంజీవరెడ్డి, నారాయణరెడ్డి, గంగారెడ్డి, శ్యాంరావు. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవం అంత్యక్రియలకు ఆర్థికసాయం



భిక్కనూరు: ఇసన్నపల్లిలో అనాథ అంత్యక్రియలకు మాజీ సర్పంచ్ గుడిసె రాములు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన బోల్లం సిద్ధయ్య అనే అనాథ సోమవారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు రూ.10 వేల నగదు అందజేశారు. నేతలు తిరుమల స్వామి, మంద రాములు, గుడిసె యాదగిరి, సత్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మంద నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెల్లుట్ల గ్రామానికి చెందిన ఒట్టెం గంగారాం మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆర్థిక సహాయం చేశారు. గంగారాం మృత దేహాన్ని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా అంబులెన్సును ఏర్పాటు చేయగా, మున్సిపల్ మాజీ చైర్మన్ కుదుముల సత్యనారాయణ అంత్యక్రియలకు సాయం అందించారు.

నేడు శబరిమాత ఆశ్రమ వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో గల శబరిమాత ఆశ్రమ 35వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన శబరిమాత భజన మండలి సభ్యులు తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా ఆశ్రమంలో గీతాపారాయణం, ధ్వజారోహణం, శబరిమాత పల్లకీసేవ, పాదుకపూజ నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

సంక్షిప్తం

ట్రాన్స్‌కో ఉద్యోగుల బదిలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పలుగ్రామాలకు చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగులు ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. నాగిరెడ్డిపేట ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్ బదిలీపై కామారెడ్డిలోని మీటర్స్ అండ్ ప్రొడక్షన్స్ టెక్నికల్ విభాగానికి వెళ్లారు. కాగా నాగిరెడ్డిపేట ఏఈగా జ్యోతి రానున్నారు. నాగిరెడ్డిపేట లైన్‌మన్ శశికాంత్‌రెడ్డి ఎల్లారెడ్డికి బదిలీ అయ్యారు.. ఆయన స్థానంలో ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేట లైన్‌మన్ ఎస్.విఠల్ బదిలీపై నాగిరెడ్డిపేటకు వస్తున్నారు. ఆత్మకూర్ లైన్‌మన్ యం.అంబ్రియా లింగంపేట మండలం మెంగారంకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎల్లారెడ్డి మండలం అడ్విలింగాల లైన్‌మన్ కాట్రోత్ లింబియా వస్తున్నారు. మండలంలోని వాడి లైన్‌మన్ కె.రాములు బదిలీపై లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డికి బదిలీ కాగా ఆయన స్థానంలో గాంధారి మండలం ముదెల్లి లైన్‌మన్ జి.శ్రీనివాస్ రానున్నారు. అలాగే తాండూర్ లైన్‌మన్ బాలకిషన్‌గౌడ్ బదిలీపై ఎల్లారెడ్డి మండలం లింగారెడ్డికి వెళ్లగా ఆయన స్థానంలో గాంధారి మండలం గుర్జాల్ లైన్‌మన్ బి.నర్సింలు రానున్నారు.

అమ్మవారి లడ్డూ @ రూ.53 వేలు



బాన్సువాడ రూరల్: బోర్లం గ్రామ శ్రీభక్త మార్కండేయ మందిరంలో ప్రతిష్ఠించిన దుర్గామాత లడ్డూ రూ.53 వేల ధర పలికింది. శరన్నవరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి మండపంలో అమ్మవారి వద్ద ఉంచిన లడ్డూకు ఆదివారం రాత్రి గ్రామస్తులు వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు లింగాల బాపురెడ్డి కూతురు సంధ్యారెడ్డి వేలంపాటలో అమ్మవారి లడ్డూను దక్కించుకున్నారు. దుర్గాదేవి సేవాసమితి ప్రతినిధులు లడ్డును బాపురెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు సరళాశ్రీనివాస్‌రెడ్డి, సంగం గంగామణి, మమ్మాయి కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఇంటి యజమాని బాధితురాలు షబానాను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వార్డు కౌన్సిలర్ వనిత, తదితరులున్నారు.